నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | KARIMNAGAR

# జగిత్యాల నుంచే బీసీ ఉద్యమం

- గులాబీ జెండానే మా గుండె ధైర్యం
- 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే దాకా వదలం
- రేవంత్‌రెడ్డి మేడిగడ్డ లింక్ 1ను ఉపయోగంలోకి తేవాలి
- సాగునీరు లేక పొలాలు ఎండుతున్నయ్
- మంగెళ రైతు పంట ఎండుతుందని పెట్టిన పోస్టు చూస్తే కన్నీళ్లు వస్తున్నయ్
- జీవనదిలా ఉన్న వరద కాలువ ఎండిపోయింది
- ఉపఎన్నిక వస్తే జగిత్యాలలో కాంగ్రెస్‌కు అడ్రస్సుండదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : పోరాటాల ఖిల్లా జగిత్యాల నుంచే బీసీ ఉద్యమం కదం తొక్కుతుందని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. గులాబీ జెండానే తమ ధైర్యమని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణలో 52 శాతం బీసీలు ఉన్నారని 2014లోనే కేసీఆర్ లెక్క తేల్చారని గుర్తు చేశారు. కానీ, అబద్ధపు మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకొని బురిడీ కొట్టించిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు బీసీ గణన విషయంలో పక్కా మోసానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు లెక్కలు చెబుతూ కావాలనే బీసీ జనాభాను తక్కువ చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీసీ వర్గాల్లో ఏ కులంలో ఎంత జనాభా ఉన్నదో లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అసెంబ్లీలో బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీర్‌పూర్ మండలం మంగెళ గ్రామానికి చెందిన రైతు ఎండిన పొలాలను చూపుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు చూస్తే కన్నీళ్లు వస్తున్నాయని తెలిపారు. కేసీఆర్‌పై అక్కసుతో మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారుకు రైతులకు నీళ్లిచ్చే తెలివి కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షను పక్కన పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం లింక్-1 ద్వారా నీటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీటి ఎత్తిపోతలు నిలిపేయడంతో జీవనదిలా ఉన్న వరద కాలువ నీళ్లులేక ఎండిపోయిన దుస్థితికి వచ్చిందని ఆవేదన చెందారు. జగిత్యాల, పెద్దపలి జిల్లాల్లో సైతం పంటలకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని, రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జగిత్యాల బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఎమ్మెల్సీ కవిత, ఎల్ రమణ, విద్యాసాగర్‌రావు, దావ వసంత తదితరులు

### కేసీఆర్‌తోనే జగిత్యాల అభివృద్ధి

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే జగిత్యాల జిల్లా అభివృద్ధి జరిగిందని, జగిత్యాలను జిల్లా కేంద్రంగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందని ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. బోర్నపెల్లి-బెల్లాల వంతెన ఎప్పుడూ ఎన్నికల హామీగానే ఉండేదని, దాన్ని కేసీఆర్ పూర్తి చేయించారని గుర్తు చేశారు. ఇప్పుడు పాత ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల మధ్య వారధి ఏర్పడడంతో పాటు అభివృద్ధి జరుగుతున్నదని తెలిపారు. 4,500 డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేసి రూ.వందల కోట్లు వెచ్చించి నిర్మించామని, ఆ ఇండ్లలో ఇంకా 900 ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాలలో మెడికల్ కాలేజీ ఏర్పాటు అవుతుందని ఎవరూ ఊహించలేదని, నేడు శరవేగంగా అతి పెద్ద మెడికల్ కాలేజీ, అనుబంధంగా దవాఖాన సిద్ధమవుతుందని తెలిపారు. కొండగట్టు అంజన్న క్షేత్రాన్ని యాదాద్రి క్షేత్రంలా మార్చాలని కలలుగన్నామని, దానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించామని, దాదాపు 350 ఎకరాల భూమిని స్థిరీకరించుకున్నామని, ప్రణాళికలు రూపొందించుకున్నామని, ఈ క్రమంలోనే ప్రభుత్వం మారిందన్నారు. ప్రభుత్వం మారితే అభివృద్ధి ప్రణాళికలు ఆగిపోవద్దన్నారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువగా నిధులు ఇవ్వాలన్నారు. ఈ ప్రాంత నాయకులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కొండగట్టు అభివృద్ధికి కృషి చేయాలని, నిధులు తేవాలని డిమాండ్ చేశారు. జగిత్యాల ప్రాంతం నేడు అభివృద్ధి పథంలో ఉందంటే కేసీఆర్ చలువతోనేనని స్పష్టం చేశారు.

### సంజయ్ కుమార్ ద్రోహం చేశారు

డాక్టర్ సంజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. 2014లో టికెట్ ఇచ్చాం. 2018, 2023లోనూ టికెట్ ఇవ్వడంతో పాటు ఆయన గెలుపు కోసం కృషి చేశాం. పార్టీ కార్యకర్తల రెక్కల కష్టంపై గెలిచిన ఆయన తల్లి పాలు తాగి రొమ్ము గుద్ది పోయారు. పార్టీకి, కార్యకర్తలకు ద్రోహం చేశారు. ఎమ్మెల్యే పార్టీ మారినా జగిత్యాల ప్రాంత కార్యకర్తలు, మనోధైర్యం, మొక్కవోని దీక్షతో ఉన్నారు. ఉప ఎన్నిక ఏ సమయంలో వచ్చినా జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోతుంది.

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### శ్రేణులకు దిశానిర్దేశం

ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటామని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భరోసానిచ్చారు. సోమవారం జగిత్యాలలో పర్యటించిన ఆమె, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, పట్టణాలకు చెందిన శ్రేణులతో సమావేశమయ్యారు. రాయికల్, బీర్‌పూర్, జగిత్యాల అర్బన్, రూరల్, సారంగాపూర్ మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు చెప్పిన విషయాలను నోట్ చేసుకోవడంతోపాటు మనోధైర్యం కల్పించారు. భవిష్యత్‌పై మార్గదర్శనం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తమవుతుందని, వచ్చేరోజులన్నీ బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటాయని వారికి వివరించారు. 'కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ 3.0 వస్తుందని, అందరూ భరోసాగా ఉండాలని సూచించారు. జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్సీ ఎల్ రమణ ఎప్పుటికప్పుడు సమన్వయం చేస్తారని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, అలాగే ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సూచించారు. 'మీ చెల్లెగా, అక్కగా చెప్తున్నా.. ఉద్యమకారులందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. తన పరిధిలో ఎక్కడ, ఎలాంటి అవకాశమున్నా ఉద్యమకారులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చానని, రానున్న రోజుల్లోనూ అలాగే ఇస్తానిన స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఓరుగంటి రమణారావు, తులా రాజేందర్‌రావు, గట్టు సతీశ్, దావ సురేశ్, శీలం ప్రియాంక ప్రవీణ్, దేవేందర్ నాయక్, సమిండ్ల శ్రీనివాస్, సందీప్ రావు, మహిపాల్‌రెడ్డి, వొల్లెం మల్లేశం పాల్గొన్నారు.

# ముగిసిన నామినేషన్ల జాతర

- ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ స్థానానికి 100 నామినేషన్లు
- టీచర్ స్థానానికి 17

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 10 : కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నామినేషన్ల జాతర సోమవారం ముగిసింది. చివరి రోజూ హోరెత్తింది. సోమవారం గ్రాడ్యుయేట్ స్థానానికి 51 మంది, టీచర్ స్థానానికి 8 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కాగా, శని, ఆదివారాలు మినహా ప్రతి రోజూ నామినేషన్లు స్వీకరించారు. సోమవారం వరకు గ్రాడ్యుయేట్ స్థానానికి 100, టీచర్స్ స్థానానికి 17 నామినేషన్లు వచ్చినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి తెలిపారు. మంగళవారం నామినేషన్లను పరిశీలించనున్నారు. 13వ తేదీ సాయంత్రం వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అదే రోజు బరిలో నిలిచెవరో తేలనున్నది. కాగా, నామినేషన్ల దాఖలుకు సోమవారమే తుదిగడువు కాగా, పలు ప్రాంతాల నుంచి వందలాది మంది అనుచరులతో తరలివచ్చి నామినేషన్ల దాఖలు చేశారు.

# సదరం సర్టిఫికెట్‌కు రూ.30 వేలు?

- కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో నయాదందా
- దివ్యాంగులను వేధిస్తున్న కిందిస్థాయి సిబ్బంది
- నేరుగా ఫోన్లు చేసి సర్టిఫికెట్ ఇప్పిస్తామంటూ బేరసారాలు
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సూపరింటెండెంట్
- దొరికింది ఏజిల్ సెక్యూరిటీ గార్డ్
- నడిపిస్తున్నది మాత్రం కిందిస్థాయి సిబ్బంది
- విధుల నుంచి సెక్యూరిటీ గార్డు తొలగింపు
- ఇంకా ఎవరైనా ఉన్నారా.. అనే కోణంలో పూర్తి స్థాయివిచారణ

**కరీంనగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో నయా దందా వెలుగుచూస్తున్నది. సదరం సర్టిఫికెట్ల పేరిట సాగుతున్న దందాను స్వయంగా దవాఖాన సూపరింటెండెంట్ పట్టుకున్న తీరు సంచలనం సృష్టిస్తున్నది. గతంలోనూ సదరం పేరిట డబ్బులు వసూలు చేయ డం, వారిపై చర్యలు తీసుకోవడం తెలిసిందే అయినా.. ఇప్పుడు కొత్త పంథాలో వసూళ్లకు దిగుతుండడం కలకలం రేపుతున్నది. దివ్యాంగుల దరఖాస్తుల్లో ఉన్న ఫోన్ నంబర్లు తెలుసుకొని నేరుగా ఫోన్లు చేస్తూ.. 'డబ్బులిస్తే మీకు దివ్యాంగుల సర్టిఫికెట్ ఇప్పిస్తా'మంటూ బేరసారాలకు దిగడం, ఆ తర్వాత అధికారుల పేర్లు చెప్పి పెద్ద మొత్తంలో లాగుతున్నట్టు తెలుస్తున్నది. ఇలానే గంగాధర మండలం గట్టుభూత్కూర్‌కు చెందిన కొత్తూరి రాజయ్య కూతురుకు ఎంసీహెచ్‌లో ఏజిల్ సెక్యూరిటీ గార్డ్ ఫోన్ చేసి.. ₹30 వేలిస్తే మీ నాన్నకు సర్టిఫికెట్ ఇప్పిస్తానని ఆశ చూపాడు. అనుమానం వచ్చిన ఆమె సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లడంతో అడ్డంగా దొరికిపోయాడు. సోమవారం సదరం శిబిరం వద్ద ఆమె డబ్బులు ఇస్తుండగా.. సూపరింటెండెంట్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం చర్చనీయాంశమైంది.**

కరీంనగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్

కరీంనగర్ విద్యానగర్, ఫిబ్రవరి 10 : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో సదరం సర్టిఫికెట్ల దందా వెలుగు చూసింది. ఒక్క దివ్యాంగుల సర్టిఫికెట్ కోసం ₹30 వేలు డిమాండ్ చేసిన ఎంసీహెచ్ ఏజిల్ సెక్యూరిటీ గార్డ్‌ను సోమవారం హాస్పిటల్ సూపరిండెంటెంట్ డాక్టర్ వీరారెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం సంచలనం రేపింది. అమాయకులైన దివ్యాంగులను దోచుకుంటున్న తీరు అవినీతిని బయటపెడుతున్నది. వివరాల్లోకి వెళ్తే.. గంగాధర మండలం గట్టుభూత్కూర్‌కు చెందిన కొత్తూరి రాజయ్య అనే దివ్యాంగుడు సదరం శిబిరం కోసం జనవరిలో మీసేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకున్నాడు. సదరం శిబిరాల నిర్వహణకు తేదీలు ఖరారు కావడంతో ఆయన కూతురుకు ఒక ఫోన్ వచ్చింది. మీ నాన్నకు దివ్యాంగుల సర్టిఫికెట్ ఇప్పిస్తానని, అందుకు ₹30 వేలు ఇవ్వాలని కోరాడు. దీంతో ఆమెకు మొదట ఆశ పుట్టింది. కానీ, పెద్ద మొత్తంలో అడగడంతో ఇంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చేదని ఆలోచనలో పడింది. క్యాంపునకు ఒక రోజు ముందు నుంచే రోజుకు నాలుగైదు సార్లు ఫోన్లు చేసి విసిగిస్తుండడంతో ఆమెకు అనుమానం వచ్చింది. ఇంతకు ఇతను ఎవరనేది తెలుసుకోవాలనే ఉద్దేశంతో 'మీ పేరే మిటి సార్' అని అడిగింది. తన పేరు సాదిక్ అని చెప్పాడు. చివరికి సదరం శిబిరం సోమవారం ప్రారంభం కావడంతో ఆమె గట్టుభూత్కూర్ నుంచి కరీంనగర్ వచ్చే వరకు అనేక సార్లు ఫోన్లు చేశాడు. కరీంనగర్ దవాఖానకు చేరుకున్న తర్వాత శిబిరం వద్దకు ఎలా వెళ్లాలి? తనను ఎలా కలవాలనే డైరెక్షన్ కూడా ఇచ్చాడు. అప్పటికే అతడిపై అనుమానంతో ఉన్న రాజయ్య కూతురు అతడి గురించి హాస్పిటల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫోన్ జరిగిన సంభాషణంతా సూపరిండెంటెంట్ డాక్టర్ వీరారెడ్డికి వినిపించారు.

### పట్టుబడిన సెక్యూరిటీ గార్డ్

వాయిస్ రికార్డులు విన్న సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఫోన్‌లో చెప్పినట్టు సదరం క్యాంపు వద్దకు వచ్చారు. ఫోన్‌లో మాట్లాడిన సెక్యూరిటీ గార్డ్ సాదిక్ రాజయ్య కూతురుతో క్యాంపు వద్ద మాట్లాడుతుండగా, డైరెక్టుగా పట్టుకున్నారు. సూపరింటెండెంట్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారించారు. అతను ఫోన్ చేసిన విషయాన్ని అంగీకరించాడు. ఇదంతా ఎవరు చేయమన్నారని ప్రశ్నించగా, దవాఖానలో పని చేస్తున్న ఒక పీఆర్‌వో పేరు చెప్పాడు. నిజానికి ఈ దందా గతంలోనూ సాగింది. ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఒక ఉద్యోగి దవాఖానలో కొంత మందితో సంబంధాలు పెట్టుకుని సదరం సర్టిఫికెట్లకు రేట్లు కట్టి విక్రయించేవాడు. ఈ విషయాన్ని అప్పట్లో 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. దీంతో ఆయనను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు పలు కేసులు నమోదు జైలుకు పంపించారు. ఇదే తరహాలో కింది స్థాయి సిబ్బందిని రంగంలోకి దింపి దవాఖానలో పనిచేస్తున్న సిబ్బంది ఇప్పుడు సదరం సర్టిఫికెట్ల దందాకు తెరలేపినట్టు తెలుస్తున్నది. నిజానికి సదరం క్యాంపునకు వచ్చే వాళ్లంతా నిరుపేదలే. వారికి డిజబులిటీని బట్టి దవాఖానలో దివ్యాంగుల సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. కానీ, కొందరు దవాఖాన సిబ్బంది జోక్యం చేసుకోవడంతో అనర్హులకు కూడా సర్టిఫికెట్లు వస్తున్నాయనే ఆరోపణలు సైతం లేకపోలేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంసీహెచ్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్న ఏజిల్ సెక్యూరిటీగార్డ్ సాదిక్‌ను పట్టుకోవడం సంచలనం సృష్టించింది.

### ఏమార్చుతున్న మోసగాళ్లు

సదరం శిబిరాల్లో ఇచ్చే దివ్యాంగుల సర్టిఫికెట్లకు ఇప్పుడు బయట బాగా డిమాండ్ ఉన్నది. ఈ సర్టిఫికెట్లను బట్టి ప్రభుత్వం దివ్యాంగ పింఛన్ ఇస్తున్నది. ఈ నేపథ్యంలో కొందరు దివ్యాంగులు సదరం శిబిరాలకు మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకుంటున్నారు. వారి డిజబులిటీని బట్టి వైద్యులు ఎంత శాతం ఉన్నదో పేర్కొంటూ సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. కానీ, దవాఖానలో ఒక టీంగా ఏర్పడిన కింది స్థాయి సిబ్బంది జోక్యం చేసుకుంటే మాత్రం వాళ్లు ఎంత రాయమంటే అంతే వైద్యులు రాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కొంత మంది సెక్యూరిటీ గార్డులు, వార్డుబాయ్‌లను రంగంలోకి దింపి దివ్యాంగులతో బేరసారాలకు దింపుతున్నారని తెలుస్తున్నది. ఒక్కో సర్టిఫికెట్‌కు ₹30 వేలు డిమాండ్ చేస్తుంటే నిరుపేదలు దిక్కుతోచని పరిస్థితిలో పడుతున్నారు. కొత్తూరు రాజయ్య విషయంలో కూడా ఇదే జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన రాజయ్యకు అనారోగ్యం కారణంగా కొన్నేళ్లుగా దవాఖానల చుట్టూ తిరుగుతున్నాడు. ఆరోగ్యం కోసం పెద్ద మొత్తంలో ఖర్చు కూడా చేశాడు. అయినా ఆయన ఆరోగ్యం మెరుగుపడలేదు. ప్రస్తుతం మంచానికే పరిమితమైన రాజయ్యకు దివ్యాంగుల సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన రాజయ్య కూతురును సెక్యూరిటీగార్డ్ సాదిక్ డబ్బులు డిమాండ్ చేయడంతో దిక్కుతోచని స్థితిలో పడింది. 'కొంత తగ్గియ్యండి సార్' అని బతిమిలాడుకున్నది. ₹10 వేలు ఇస్తానని ఒప్పుకొన్నా.. సాదిక్ మాత్రం ఇదంతా పెద్ద సార్లకు వెళ్తుందని, తనకు ఐదో పదో ఇస్తారని, తాను ₹25 వేలు ఇచ్చినా మిగతా ₹5 వేలు నొక్కేశావా అని మా సార్లు నన్ను అడుగుతారని ఫోన్‌లో చెప్పడం రికార్డయింది. ఫోన్‌లో జరిగిన ఈ సంభాషణ వింటుంటే దవాఖానలో పెద్ద ముఠానే ఉన్న అనుమానం కలుగుతున్నది. ఈ విషయంలో లోతైన విచారణ జరిపి, దీని వెనక ఎవరెవరు ఉన్నారో పరిశీలించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అప్పుడే ఇలాంటి ఉదంతాలకు బ్రేక్ పడుతుందని పలువురు చెబుతున్నారు.

### సెక్యూరిటీ గార్డ్‌ను తొలగిస్తున్నాం

సదరం శిబిరం వద్ద డబ్బులు డిమాండ్ చేసిన సెక్యూరిటీ గార్డ్ సాదిక్‌ను ఉద్యోగంలోంచి తొలగిస్తున్నాం. ఇలాంటి వాళ్లు ఇంకా ఎవరైనా ఉన్నారా..? అనే కోణంలో విచారణ జరిపిస్తాం. సదరం శిబిరం వద్ద తరచూ సిబ్బంది విధులను మార్చుతున్నాం. అయినా ఇలాంటి దందాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇక ముందు కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొంత మంది సిబ్బందిపై వచ్చిన ఆరోపణలు వస్తే డ్యూటీలు మార్చాం. అయినా వాళ్లు నిత్యం సదరం క్యాంపుల చుట్టే తిరుగుతున్నారు. ఇలాంటి వాళ్లను ఇప్పటికే కొందరిని గుర్తించాం. వారు తమ విధానాలు మార్చుకోకుంటే కఠినంగా శిక్షించకతప్పదు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- గుండా వీరారెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ (కరీంనగర్)

# హరితహారం చెట్ల నరికివేత

- కోనరావుపేట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోనే తీసేయించిన అధికారులు
- మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయించామని వెల్లడి

కోనరావుపేట, ఫిబ్రవరి 10 : ''మొక్కలు నాటాలి.. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది.. ఇంటికి ఐదు మొక్కలు పెంచాలి'' అంటూ ప్రతి ప్రభుత్వ సమావేశాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులే , మొక్కల పాలిట శాపంగా మారారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లను మేకలు మేస్తే కాపరికి, ఇంటి ఎదుట పెరిగిన చెట్టు కొమ్మలను నరికి వేస్తే యజమానికి జరిమానా విధించి అధికారులే.. ఏపుగా పెరిగిన పదుల సంఖ్యలో చెట్లను నరికివేసిన ఘటన కోనరావుపేట మండల కేంద్రంలో వెలుగుచూసింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో గత ప్రభుత్వ హయాంలో హరితహారం పథకం ద్వారా మొక్కలను నాటే ప్రక్రియ చేపట్టారు. అవి కాస్త ఇప్పుడు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. అయితే, ప్రస్తుత ప్రభుత్వం మండలానికో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మించేందుకు అధికారులు ఈ చెట్లు ఉన్న స్థలాన్నే కేటాయించారు. ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల ఎదుట చాలినంత ఖాళీ స్థలం ఉన్నప్పటికీ ఈ స్థలాన్నే కేటాయించడంలో అంతర్యమేమిటో తెలియడం లేదు. అంతే కాకుండా, దుంగలు కూడా కనిపించకుండా పోయాయి. చెట్లు నరికివేయడమే కాకుండా, దుంగలు మాయమవడం చూస్తే కంచే చేను మేసినట్లుగా మండలాధికారుల పనితీరు ఉందని ప్రజలు మండిపడుతున్నారు. కాగా, ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో గూడ శంకర్‌రెడ్డిని సంప్రదించగా, మండల కేంద్రానికి కేటాయించిన ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణం కోసం ఈ స్థలాన్ని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు పరిశీలించారని, ఆ తర్వాత చెట్లను నరికివేయడానికి కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో సదరు కాంట్రాక్టర్ వాటిని నరికివేసి దుంగలను తీసుకువెళ్లినట్లు తెలిపారు.

కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నరికివేసిన చెట్లు

### 14న తెలంగాణ బంద్‌కు పిలుపు

గోదావరిఖని, ఫిబ్రవరి 10 : వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధంగా చేపట్టారని నిరసిస్తూ ఈ నెల 14న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నట్లు మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రామమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 జనాభా గణాంకాల ప్రకారం ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర గణాంకాలను ఎలా లెక్కించారని ప్రశ్నించారు. ఈ వర్గీకరణతో సీఎం రేవంత్‌రెడ్డి మాలలకు ద్రోహం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా వర్గీకరణ పక్రియను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు దేవి లక్ష్మీ నర్సయ్య, జూపాక సుధీర్, కారంగుల శ్రీశైలం, మధుబాబు, కిషోర్‌కుమార్, నవీన్, బీమా, రమణమూర్తి, సుధీర్ ఉన్నారు.

# మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి

- మాటలే తప్ప చేతలు లేని ప్రభుత్వం
- వెల్గటూర్‌కు మంజూరైన వ్యవసాయ కళాశాల ఏది?
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, ఫిబ్రవరి 10 : ప్రజలకు అబద్ధాలు చెప్పి మోసకారి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలను అమలు చేస్తానని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు మాయ మాటలు చెబుతున్నదని, 420 హామీలు ఇచ్చి ప్రజలను వంచించి మోసం చేసిందని విమర్శించారు. 'రైతు భరోసా లేదు, పింఛన్ పెంచలేదు, కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారం ఇవ్వడం లేదు, దివ్యాంగులకు ₹6 వేల పింఛన్ రావడం లేదు, దళితబంధు లేదు' అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్తంభంపల్లికి వ్యవసాయ కళాశాల మంజూరు చేశామని, ఇప్పుడు ఎందుకు పనులు చేయడం లేదని ప్రశ్నించారు. కోటిలింగాల ఆలయ అభివృద్ధికి ₹2.50 కోట్లు మంజూరు చేశామని, పనులు ఎక్కడివక్కడే ఎందుకు నిలిచి పోయాయని మండిపడ్డారు. టూరిస్టుల సౌకర్యం కోసం నిర్మించినన హరిత హోటల్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారని నిలదీశారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం వచ్చిన పనులను పూర్తి కోసం స్థానిక ఎమ్మెల్యేను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అధికారులు, పోలీసులు అధికార పార్టీ నాయకుల కనుసైగల్లో పని చేస్తున్నారని, ఇది మంచి పరిణామం కాదన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ పరంగా కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అంతకు ముందు మండలంలోని పలు శుభకార్యాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఎలేటి కృష్ణారెడ్డి, పత్తిపాక వెంకటేశ్, మూగల సత్యం, ముల్కల్ల గంగారం, జూపాక కుమార్, పోడేటి రవి, బిడారి తిరుపతి, రంగు తిరుపతి, బందెల నర్సయ్య, బందెల రాజయ్య, గుంగ జగదీశ్వర్ గౌడ్, ఎర్రోళ్ల మహేశ్, కటుకం రమేశ్, ఎర్రం పోచమల్లు ఉన్నారు.